క్లుప్తంగా

నేడు బక్రీద్

మహబూబాబాద్ రూరల్: త్యాగానికి ప్రత్యేకగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే బక్రీద్ పండుగ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని పాత బజారు, కొత్త బజారు ఈద్గా మైదానాలు బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబయ్యాయి.

సీఐగా పదోన్నతి



మహబూబాబాద్ రూరల్: జిల్లా పోలీసు కార్యాలయంలోని ఐటీ సెల్ విభాగంలో పనిచేస్తున్న ఎస్సై బియ్యాని సంతోష్ రావు సీఐగా పదోన్నతి పొందారు. ఈ మేరకు పోలీసు శాఖ తెలంగాణ నార్త్ జోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సంతోష్ రావును ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అభినందించారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం



కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో స్ట్రీట్ కాస్ సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను, సంస్థ చీఫ్ అడ్వైజర్ కటికనెని నిహల్‌కృష్ణ, చీఫ్ మెంటార్ ధ్రువ్‌నారాయణ్, సుజిత, జయంత్, విష్ణు శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందనే సమాచారం తెలుసుకున్న సంస్థ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ.1.50లక్షల విలువైన వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్లాంట్ కమిటీ బాధ్యులు సంకు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరామోజు మహేశ్వరాచారి, శాగంటి రాములు పాల్గొన్నారు.

క్రీడాపోటీలు..

కురవి: గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను వెలికితీసి వారిలో నైపుణ్యాలను గుర్తించేందుకు గ్రామీణ క్రీడలు దోహదం చేస్తాయని ఎస్సై గండ్రాతి సతీష్ అన్నారు. శుక్రవారం మండలంలోని నేరడ గ్రామంలో నేతాజీ యూత్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల స్థాయి గ్రామీణ కబడ్డీ క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో క్రీడల కన్వీనర్ మడ్డి సత్యమూర్తి, ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్ రెడ్డి, ఇరుగు మధు, ఎస్‌కె జానీ, కడియం సత్యం, సీహెచ్.నాగన్న పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ఉండాలి

కురవి: ఆత్మహత్యలు పరిష్కారం కాదని, ఆత్మస్థైర్యంతో ఉండాలని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. శుక్రవారం సీరోలు మండలం కొత్తూరు(సి) గ్రామంలో మలిశెట్టి వేణు అధ్యక్షతన ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీరోలు ఎస్సై నగేష్, పీహెచ్‌సీ వైద్యురాలు విరాజిత, హెచ్‌ఎం వీరన్న, ఉపాధ్యాయుడు మనోహర్, కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

మురుగు నీరు తొలగింపు

బయ్యారం: మండలంలోని బయ్యారం-ఉప్పలపాడు రహదారిపై చోక్లాతండా వద్ద రహదారి పై దుర్గంధం శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. రహదారి పక్కన ఉన్న మిషన్‌భగీరథ పథకం నీటి లీకేజీ కాకుండా చూడటంతోపాటు నిలిచిన నీటిని కాల్వ ద్వారా శుక్రవారం పంచాయతీ సిబ్బంది బయటకు పంపించారు.

కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

నెహ్రూసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం కళాకారులను గుర్తించి వారి సమస్యలను పరిష్కరించాలని ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి నక్క సైదులు అన్నారు. కళాకారుల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం శుక్రవారం జిల్లా కేంద్రంలోని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 58 సంవత్సరాలు నిండిన కళాకారులకు పింఛన్ ఇవ్వాలని, కళాకారులకు జీవనోపాధి కల్పించాలన్నారు. ఈ సమావేశంలో నక్క ఉప్పలయ్య, గద్ద వెంకన్న, దొంతు రాంమూర్తి, నూనె శ్రీనివాస్, బొమ్మకంటి సైదులు, మన్యం మల్లేష్, గడ్డం కృష్ణమూర్తి తదితరుల పాల్గొన్నారు.

అవయవదానంతో పునర్జన్మ



అభినందన పత్రం ఇస్తున్న మల్లారెడ్డి

మహబూబాబాద్ రూరల్: అవయవదానం చేయడం ద్వారా ఇంకొకరికి పునర్జన్మ ఇచ్చిన వారవుతారని తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ వరంగల్ అధ్యక్షుడు కె.మల్లారెడ్డి అన్నారు. మహబూబాబాద్ మండలంలోని చిన్నకిష్టాపురం గ్రామానికి చెందిన జాటోతు రాజశేఖర్ మృతిచెందగా అతడి అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. శుక్రవారం కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపి సత్కరించి, అభినందన పత్రం అందజేశారు. రాజశేఖర్ సంస్మరణ సభలో నివాళులర్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అరుణ, జ్యోతి, సుధారాణి, నీలమ్మ, పెళ్లి ఉపేందర్ రెడ్డి, మునగాల పద్మ పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ పాలనతో అస్తవ్యస్తం

- మానుకోటలో రెగ్యులర్ కమిషనర్ లేక గాడితప్పిన పాలన
- పారిశుద్ధ్య సమస్యతో సీజనల్ వ్యాధులు
- పైపులైన్ల కోసం తీసిన గుంతలతో పొంచి ఉన్న ప్రమాదం



కంకరబోడ్ ప్రాంతంలో రోడ్డుపైనే చెత్తాచెదారం



రెడ్డి బజార్‌లో..

మహబూబాబాద్: మానుకోటలో రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో ఇన్‌చార్జ్ కమిషనర్‌తో పాలన గాడి తప్పుతోంది. ప్రధానంగా పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు ఐదు నెలలు పెండింగ్‌లో ఉండడంతో వారిపై పర్యవేక్షణ చేసే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కూడా ఏమీ చేయలేకపోతున్నారు. కార్మికులు అసంతృప్తిగా పని చేయడంతో పనిపై పెద్దగా దృష్టి సారించడం లేదు. దీంతో రోడ్లపైనే చెత్తాచెదారంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి పందులు స్వైర విహారం చేస్తున్నాయి. సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీనికితోడు ఐదు నెలల వేతనాల పెండింగ్‌తో కార్మికులు ఒక్కరోజు పనులు నిలిపివేశారు.

మానుకోట మున్సిపాలిటీ పరిధిలో 36 వార్డులు ఉండగా 68,889 మంది జనాభా, 57,828 మంది ఓటర్లు 25,000లకు పైగా గృహాలు ఉన్నాయి. విద్యా, వ్యాపారం, ఉద్యోగ రీత్యా మానుకోట నివాసం ఉండే వారితో కలిపితే లక్ష జనాభా దాటుతుంది. 205 మంది అవుట్ సోర్సింగ్ విధానంలో కార్మికులు పని చేస్తున్నారు. వీరికి వేతనాలు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. పనులు బంద్ చేస్తామని కార్యాలయం ఎదుట పలుమార్లు ఆందోళన చేశారు. పనులు సక్రమంగా చేయకపోవడంతో రోడ్లపైనే చెత్తాచెదారంతో దుర్గంధం వెదజల్లుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు పలు వార్డులల్లో మిషన్‌భగీరథ పైపులైన్ల నిర్మాణం కోసం గుంతలు తీసి వదిలేశారు.

రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో..

ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీన మానుకోట మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన నోముల రవీందర్ ఉద్యోగ విరమణ పొందారు. వరంగల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తున్న టి.రాజేశ్వర్‌ను మానుకోట మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. పలు పార్టీల ఆధ్వర్యంలో రెగ్యులర్ కమిషనర్‌ను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు వినతులు ఇచ్చారు.

నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



కేసముద్రం: ఇంటికన్నెలో మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం: అర్హులైన నిరుపేదలకే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని రైతువేదికలో, బోడమంచ్యాతండా జీపీ, అర్పనపల్లి, ఇంటికన్నె గ్రామాల్లో పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. బోడమంచ్యాతండాలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పార్టీ తొత్తులకే పథకాలను కట్టబెట్టారని, అదే కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా నిరుపేదలకే పథకాలను అందిస్తుందన్నారు. అదేవిధంగా బోడమంచ్యాతండాజీపీలోని ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన బడిబాటలో ఎమ్మెల్యే పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, ఎంపీడీఓ క్రాంతి, కేసముద్రం, ధన్నసరి పీఏసీఎస్ వైస్ చైర్మన్‌లు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, ధన్నసరి సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, గుగులోతు దస్రూనాయక్, కదిర సురేందర్, వేముల శ్రీనివాస్‌రెడ్డి, పోలెపాక నాగరాజు, ముజ్జు, రాజుల పాటి మల్లయ్య, గాదె శ్రీను, ఐతే సారయ్య, బానోతు చందు, కాలె కట్టయ్య పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని బొల్లెపల్లి, రాజనపల్లి, గుండెంగ, మథనాపురం, గాజులగట్టు, టీఆర్ తండా, భూపతిపేట, వెంగంపేట, సీతానగరం, చిన్న ఎల్లాపురం, లైన్‌తండా, కోబల్‌తండా, మర్రిమిట్ట గ్రామాల్లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులకు ఇంటి పత్రాలను ఎమ్మెల్యే మురళీనాయక్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరస్వామి, ఎడ్ల నరేష్‌రెడ్డి, కందిక సుమలత పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు



రిజిస్టర్ పరిశీలిస్తున్న అధికారి సారంగం

గూడూరు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్) అధికారి డాక్టర్ సారంగం అన్నారు. మండలంలోని తీగలవేణి పీహెచ్‌సీని శుక్రవారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసర ప్రాంతాలతోపాటు, ఆసుపత్రిలోని గదులు, మందుల నిల్వ, ల్యాబ్‌లను పరిశీలించారు. అనంతరం జాతీయ కార్యక్రమాలపై, వైద్య సేవలపై సూచనలు చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు ఉంటాయని, సమయానుకూలంగా విధులకు హాజరుకావాలన్నారు. ఓపీ, ఇతర రిజిస్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ, తీగలవేణి వైద్యాధికారి రాంబాబు, హెచ్‌ఈఓ లోక్యానాయక్, హెల్త్ సూపర్‌వైజర్ రమేష్, ఫార్మసిస్టు అమల, దాసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించండి

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఎంఈఓలు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్న ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు.

నెల్లికుదురు మండలంలోని నర్సింహులగూడెంలో బడిబాట కార్యక్రమంలో ఎంఈఓ రాందాస్‌ను ఓ విద్యార్థి తండ్రి ప్రశ్నించాడు. ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా వారు నివాసం ఉంటున్న ప్రాంతాలల్లోని ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లల్ని పంపించిన తర్వాత మాకు అవగాహన కల్పించాలని ప్రశ్నించాడు.

– సాక్షి నెట్‌వర్క్



కేసముద్రం: బోడమంచ్యాతండాలో బడిబాటలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీనాయక్



గూడూరు: బొల్లెపల్లి బడిబాటలో ఆర్డీఓ కృష్ణవేణి



మరిపెడ రూరల్: రాంపురంలో..



కురవిలో బడిబాట..



నర్సింహులపేటలో..



దంతాలపల్లి: పెద్దముప్పారం గ్రామంలో..



గార్లలో బడిబాట ర్యాలీ..



నెల్లికుదురు: నర్సింహులగూడెంలో..



డోర్నకల్: తొడేళ్లగూడెంలో..

కాల్పుల విరమణ ప్రకటించాలి



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి, మావోలతో శాంతిచర్చలు జరపాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో శుక్రవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి, ఎస్‌కె మధార్ మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరా అడవుల్లో హత్యకాండ విధ్వంసాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, వెంకన్న, రాజమౌళి, సీతారాం నాయక్, కుమ్మరికుంట్ల నాగన్న పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం..



మాట్లాడుతున్న డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్

గార్ల: టీబీ రహిత సమాజ స్థాపన కోసం ప్రభుత్వ వైద్యులు, వైద్య సిబ్బంది కృషి చేయాలని ప్రభుత్వ నోడల్ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ సూచించారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని ఉద్దేశించి స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్య సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా క్షయ నివారణ, ముందస్తు జాగ్రత్తలు, దశలవారీగా మండలాలు, గ్రామాల్లో జరిగే స్క్రీనింగ్ పరీక్షల తేదీలను ఆయన ప్రకటించారు. క్షయ, టీబీ సోకిన తర్వాత కంటే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మంగమ్మ, వైద్యులు శివకుమార్, హనుమంతరావు, హెచ్‌ఈఓ శ్రీహరి, వైద్య సిబ్బంది ఇస్మాయిల్‌బేగ్, వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్య తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న సందీప్, గ్రామస్తులు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని వీఎస్.లక్ష్మీపురం గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి తండ సందీప్ అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో వీఎస్.లక్ష్మీపురం గ్రామాన్ని శుక్రవారం సందర్శించి సమస్యలపై సందీప్ మాట్లాడారు. గత ఏడాది కురిసిన అకాల వర్షాలకు చెరువు కట్ట తెగడంతో పశువులకు, పంటపొలాలకు నీళ్లలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పశువుల దవాఖానాకు డాక్టర్ లేడని, గ్రామ సచివాలయ పనులు మధ్యలోనే నిలిపివేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము నారాయణ, గుగులోత్ వీరన్న, యసల్ల గుట్టయ్య, ఉప్పుల మల్లయ్య, ఉప్పుల నర్సయ్య, పుణ్యపూర్తి శ్రీను పాల్గొన్నారు.

దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి



గూడూరు: సదస్సులో పాల్గొన్న ఆర్డీఓ కృష్ణవేణి

గూడూరు: భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు చేసుకునే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆర్డీఓ కృష్ణవేణి అన్నారు. మండలంలోని బొల్లెపల్లిలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సును సందర్శించారు. ఈసందర్భంగా దరఖాస్తు చేసుకుంటున్న రైతులతో మాట్లాడారు. బొల్లెపల్లి సదస్సులో 223, దామరవంచ రెవెన్యూ సదస్సులో 242 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ నాగభవాని, డీటీ కోమల తెలిపారు.

నెల్లికుదురు: మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో 109, ఎర్రబెల్లిగూడెం గ్రామ శివారు రామానుజాపురంలో 12దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ చందా నరేష్ తెలిపారు.

గార్ల: మండలంలోని బుద్ధారంలో 102, పుల్లూరు పంచాయతీలో అత్యధికంగా 208 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శారద వెల్లడించారు.

బయ్యారం: మండలంలోని రామచంద్రాపురం, లింగగిరి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో పలు సమస్యలపై 143 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత

మహబూబాబాద్ రూరల్: తప్పిపోయిన బాలికను ఆమె బంధువులకు అప్పగించిన సంఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. బయ్యారం మండల కేంద్రానికి చెందిన మానస అనే బాలిక జిల్లా కేంద్రంలో దారితప్పి ఏడుస్తూ రైలుపట్టాలు దాటుతుండగా జిల్లా కాంగ్రెస్ నాయకుడు శంతన్ రామరాజు గమనించి, బాలికను ఇంటికి తీసుకెళ్లి భోజనం పెట్టాడు. అనంతరం టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ సమక్షంలో బాలికను వారి బంధువులకు అప్పగించారు. బాలికను కాపాడిన శంతన్ రామరాజును టౌన్ సీఐ దేవేందర్ ప్రత్యేకంగా అభినందించారు.

సంక్షిప్త సమాచారం

14నుంచి లోక్ అదాలత్

కొత్తగూడ: వివిధ కేసుల్లో నిందితులుగా ఉండి ఇబ్బందులు పడుతున్న వారు ఈనెల 14నుంచి జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై కుశకుమార్ తెలిపారు. వివరాల కోసం 87126 56964, 87125 25614 నంబర్‌లను సంప్రదించాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి

మరిపెడ రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ గుగులోతు రవి సూచించారు. శుక్రవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది డాక్టర్ స్వామి, సాయిశ్రీ, సిరి, సరిత, ఏఎన్‌ఎమ్స్ నర్సు బాయి పాల్గొన్నారు.

ఫీజులో రాయితీ ఇవ్వాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రైవేట్ పాఠశాలలో జర్నలిస్టు పిల్లలందరికీ ఫీజులో రాయితీ కల్పించి, ఆదుకోవాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్‌స్ (టీయూడబ్ల్యూజే, హెచ్143) సంఘం నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం డీఈఓ రవీందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మద్దినేని గుట్టయ్య, గౌస్ పాషా, సత్యం, రామకృష్ణారెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మరిపెడ రూరల్: అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు విడతల వారీగా వస్తాయని కాంగ్రెస్ జిల్లా నాయకుడు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అబ్బాయిపాలెం గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీలక్ష్మీ, కారోబార్ యాదగిరి, ఫీల్డ్ అసిస్టెంట్ రాయల రవి, నాయకులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

దంతాలపల్లి: మండల విద్యావనరులకేంద్రం నుంచి మండలంలోని పాఠశాలలకు ఎంఈఓ శ్రీదేవి పాఠ్యపుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని పాఠశాలలకు 8094 పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ

డోర్నకల్: మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం ఇందిరమ్మ పథకానికి ఎంపికైన అర్హులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ విజయానంద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కాలా సుమేర్‌చంద్‌జైన్, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్, సీఐ బి.రాజేష్, ఎస్సై గడ్డం ఉమ పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

నెహ్రూసెంటర్: జిల్లాలోని బయ్యారం మండలంలో విభజన హామీలను అమలు చేస్తూ ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు శంతన్ రామరాజు అన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ఉద్యమ కేసులో శుక్రవారం కోర్టుకు హాజరయ్యారు. కార్యక్రమంలో అజయ్‌సారథి రెడ్డి, గుంజె హన్మంతు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

క్రీడలతో మంచి భవిష్యత్



కురవి: క్రీడలతో మంచి భవిష్యత్ ఉంటుందని, క్రీడలతోపాటు చదువులో రాణించాలని డీవైఎస్‌ఓ జ్యోతి అన్నారు. మండలంలోని నేరడ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కబడ్డీ వేసవి శిక్షణా శిబిరం శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో కోచ్ మధు, సురేష్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కేసముద్రం: మండలంలోని ఇంటికన్నె గ్రామంలో తాగునీటి సరఫరా కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను కాంగ్రెస్ నాయకులతో కలిసి, విద్యుత్ అధికారులు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, శ్రీనివాస్, సారయ్య, రంజిత్‌గౌడ్, లైన్‌మన్ ఐలేష్, విజయ్, ఏఎల్‌ఎం వీరన్న, సబ్ ఇంజనీర్ కరుణాకర్, జేఎల్‌ఎం నరేష్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మతల్లి ఆలయ దర్వాజ పూజ

మహబూబాబాద్ రూరల్: మండలంలోని మాధవాపురం గ్రామంలో ముత్యాలమ్మతల్లి ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా దర్వాజ ఎత్తే పూజలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ పురోహితులు గుండోజు నాగార్జునచార్యులు, సహ అర్చకులు పూజలు జరిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్ది వెంకట్ రెడ్డి, బంటు అంజయ్య, ఆలయ కమిటీ చైర్మన్ జక్కుల వెంకట్ రెడ్డి, నూకల లింగన్న పాల్గొన్నారు.

తహసీల్దార్ మృతికి నివాళి

తొర్రూరు రూరల్: గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందిన మండలంలోని చెర్లపాలెం గ్రామానికి చెందిన హన్మకొండ తహసీల్దార్ కక్ర శ్రీపాల్ రెడ్డి మృతదేహానికి తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి

మరిపెడ రూరల్: మండలంలోని 48 గ్రామ పంచాయతీలపై గ్రామ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, జీపీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీఓ సోమ్లనాయక్ సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామ పంచాయతీ పరిధిలో చెత్త చెదారం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.

నవదంపతులకు మోదీ ఆశీర్వాదం

బయ్యారం: ఇటీవల వివాహం చేసుకున్న నవదంపతులకు ఆశీర్వాదం తెలుపుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ లేఖ పంపారు. గత నెల 23న బయ్యారానికి చెందిన మద్దెల శివకుమార్‌కు ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ఉసిరికాయపల్లికి చెందిన పచ్చిపాల లలితతో వివాహం జరిగింది. తమ కుమారుని వివాహానికి ఆహ్వానిస్తూ ఏప్రిల్ నెలలో శివకుమార్ తల్లి సుగుణ శుభలేఖను పీఎం కార్యాలయానికి పంపించారు. దీనికి స్పందిస్తూ పీఎం కార్యాలయం నుంచి నూతన దంపతులకు ఆశీర్వాదం తెలుపుతూ లేఖ పంపించడంతో శివకుమార్ కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కంప్యూటర్‌పై శిక్షణ అభినందనీయం



మాట్లాడుతున్న ఎంఈఓ

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రకృతి సంరక్షణ స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో కంప్యూటర్‌పై అవగాహన కల్పించడం అభినందనీయమని ఎంఈఓ రాందాస్ సేవా సమితి నిర్వాహకులను కొనియాడారు. శుక్రవారం మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలోని ఎంపీ యూపీఎస్‌లో కంప్యూటర్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఎంఈఓ మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మావతి, కార్యదర్శి మణిదీప్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బండారి ఉప్పలయ్య, కోశాధికారి యాతం ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శి గద్దె అంబరీష్, ఉపాధ్యక్షుడు లింగయ్య పాల్గొన్నారు.

మానుకోటలో రాసలీలల కలకలం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన ఓ మాజీ మహిళా ప్రజాప్రతినిధి, మరో మాజీ ప్రజాప్రతినిధి భర్త రాసలీలల్లో ఉండగా అతడి భార్య నేరుగా పట్టుకుని మాజీ మహిళా ప్రజాప్రతినిధికి దేహశుద్ధి చేసింది. రాసలీలల కలకలం ఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. జిల్లా కేంద్రంలో గల ఓయో రూంలో ఓ మాజీ ప్రజాప్రతినిధి భర్త ఓ మాజీ మహిళా ప్రజాప్రతినిధితో రాసలీలల్లో మునిగి తేలుతున్నారు. సమాచారం తెలుసుకున్న సదరు మాజీ మహిళా ప్రజాప్రతినిధి, కుటుంబ సభ్యులు ఓయో రూంపై దాడిచేసి తలుపులు పగలగొట్టి అందులోకి చొరబడి ఆమె భర్త, ఆ మాజీ మహిళా ప్రజాప్రతినిధికి దేహశుద్ధి చేసింది. అనంతరం పోలీసులు ఓయోరూం వద్దకు చేరుకున్నారు. ఈ విషయంపై మాజీ మహిళా ప్రజాప్రతినిధి మాట్లాడుతూ.. గతంలో ఒక సారి రెడ్ హ్యాండెడ్ గా దొరకబట్టి మందలించి వదిలివేశానని, అయినా పద్ధతి మార్చుకోకపోవడంతో ఓయోరూంలో ఇద్దరిని పట్టుకుని దేహశుద్ధి చేశామని తెలిపారు. జరిగిన సంఘటనపై కఠిన పోలీసులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.